క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ: ఇటీవల మున్సిపల్ ట్రాలీ ఆటో బోల్తాపడగా ఇద్దరు కార్మికులు సిద్దిరాంలు, భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లోని రష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్మికుల వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని మడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం మండలంలోని మడూర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌కు చెందిన గడ్డివాముకు నిప్పంటుకుని దగ్ధమైంది. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించినా.. వారు స్పందించే లోపులోనే గడ్డివాము పూర్తిగా దగ్ధమైందని బాధితుడు కరుణాకర్ తెలిపారు. ఈ అగ్నిప్రమాదంతో 90 గడ్డి మోపులు దగ్ధమైనట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

అంధత్వ నివారణకే వైద్య శిబిరాలు



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజునాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): అంధత్వ నివారణకు ప్రభుత్వం గ్రామాలు, తండాల్లో ఉచితంగా కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తుందని ఎంపీపీ రాజునాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని మర్రిచెట్టుతండాలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జివాల్యానాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు రామాగౌడ్, డాక్టర్ సృజన, వైద్యసిబ్బంది, తండావాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రేగోడ్(మెదక్): మండలంలోని గజ్వాడ గ్రామంలో సంగారెడ్డిలోని హోప్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్‌ఐ సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్లు శిరీష, శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 200ల మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



మృతి చెందిన పాడిగేదె

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండలంలోని నడిమితండా శివారులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన శాంతీబాయికి చెందిన పాడిగేదె మేసుకుంటూ పోతూ గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడిగేదె మృతి చెందడంతో రూ.50వేలు నష్టం జరిగిందని బాధితురాలు శాంతీబాయి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సాయం అందించాలని ఆమె కోరారు.

అండగా ఉంటాం

శివ్వంపేట(నర్సాపూర్): ఈదురు గాలులతో నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండలంలోని సిత్యా తండాకు చెందిన లంబడి చందర్‌నాయక్ ఇంటి పై కప్పు రేకులు మంగళవారం ఈదురుగాలులతో తొలగిపోయాయి. బుధవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ. 5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. నాసు తండాలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బుచ్చునాయక్ చికిత్స కోసం రూ.5 వేల నగదు ఇచ్చారు.

క్రీడలతో మానసికోల్లాసం

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని, ప్రతీ ఒక్కరు క్రీడల ద్వారా శారీరక శ్రమ కలిగించాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో బాలుర జూనియర్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ – 2023 క్రీడల ముగింపు ఉత్సవాల్లో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన తెలంగాణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ.. ప్రతీ గ్రామంలో క్రీడామైదానాలు ఏర్పాటు చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ క్రీడలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో సంపూర్ణ సహకారమందించి విజయవంతం చేసిన మండల కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో తమ ప్రతిభను కనబరచాలని అన్నారు. అనంతరం 11 క్రీడల్లో గెలుపొందిన విజేతలకు, రన్నర్‌లకు కలెక్టర్, ఎమ్మెల్యే కప్, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, జెడ్పీ సీఈఓ శైలేష్, జయరాజ్, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి, ఎంపీపీ ఫోరం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజ్, డీఈఓ రాధాకిషన్, మునిసిపల్ కమిషనర్ జానకి రామ్‌సాగర్, డీఎస్పీ సైదులు, వ్యాయామ ఉపాధ్యాయులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): హరితహారం నాటికి వన నర్సరీల్లో మొక్కలను ఏపుగా పెరిగేలా చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిచెట్టుతండాలో పారిశుధ్యం పనులను, వననర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మట్లాడుతూ.. వచ్చే హరితహారం నాటికి వననర్సరీలో పంచాయతీ పరిధిలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని చెప్పారు. తడి, పొడి చెత్త వేరు చేసి డంప్‌యార్డుకు తరలించాలన్నారు. పంచాయతీ ట్రాక్టర్లను ప్రైవేట్ పనులకు వినియోగించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జివాల్యానాయక్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, తండావాసులు పాల్గొన్నారు.

'అకౌంట్ అప్‌డేట్ ఉంటే ఆధార్‌తో పనిలేదు'



బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణరావు

నర్సాపూర్: బ్యాంకులో ఖాతా అప్‌డేట్ అయి ఉంటే పెద్ద నోట్లను ఖాతాలో జమ చేసేందుకు ఆధార్ కార్డుతో పని లేదని ఎస్‌బీఐ శాఖ మేనేజర్ సత్యనారాయణరావు చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... రూ.2000 నోట్లను ఆర్‌బీఐ ఉపసంహరించిన నేపథ్యంలో వాటిని బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఖాతాదారులకు పలు సూచనలు చేశారు. బ్యాంకు ఖాతాతో గతంలోనే ఆధార్‌కార్డు నంబర్‌ను నమోదు చేసి, ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. అలాంటి ఖాతాదారులు ఆర్‌బీఐ నిబంధనల మేరకు రెండు వేల రూపాయల పది నోట్లను ఒక దఫా తమ ఖాతాలో జమ చేసుకోవచ్చని సూచించారు. కొందరు ఖాతాదారులు ఆధార్ కార్డు నంబర్‌ను బ్యాంకు ఖాతాతో నమోదు చేయలేదని, అలాంటి ఖాతాదారులు ప్రస్తుతం తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తమ సిబ్బందికి అందజేస్తే వారు ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాతో అప్‌డేట్ చేస్తారని వివరించారు. ఆధార్ నంబర్ అప్‌డేట్ చేసిన అనంతరం రూ.2000 నోట్లను తమ ఖాతాలో జమ చేసుకోవచ్చని చెప్పారు. కాగా తమ బ్యాంకులో ఆర్‌బీఐ సూచనల ప్రకారం రూ.2000 నోట్ల జమ కార్యక్రమం సజావుగా కొనసాగుతుందన్నారు.

వైభవంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 12వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ గౌడ సంఘం సభ్యులు పూజలు చేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్‌లతో పాటు సంఘం సభ్యులు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ అనుసూయ, మాజీ జెడ్పీటీసీ మాధవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ తదితరులు పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కాగా రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు అశోక్‌గౌడ్, తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ తదితరులు వేర్వేరుగా పూజల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పలువురు నాయకులను గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, సత్యంగౌడ్, సత్యనారాయణగౌడ్, అనిల్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, రామకృష్ణగౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు అతిథులను సన్మానించారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం ఏఓ స్వప్న, ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తదితరులు తనిఖీ చేసి ఎరువులు, విత్తనాల శాంపిల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. డీలర్లు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని చెప్పారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగుల మందులు వాడాలని చెప్పారు. మోతాదుకు మించి వాడొద్దన్నారు.

సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిని విద్యార్థులను ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. పట్టణంలోని అజంపురా వీధిలోని షాదీఖానాలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులను సన్మానించి, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమానికి స్పాన్సర్‌గా మెదక్ జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ నసీర్ అహ్మద్ నియాజి నిలిచారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రభుత్వ బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు అక్బర్, తఖియుద్దీన్, మీర్ ఆబెద్ అలీ, ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ రియాజుద్దీన్, జుబేర్ అహ్మద్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇంతియజుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎండీ యూసుఫ్‌అలీ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ హమేద్ బిన్ హుస్సేన్, జర్నలిస్టులు ఎండీ అఫ్సర్, యండి నజముద్దీన్, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్, బీఆర్‌ఎస్ పట్టణ మైనారిటీ అధ్యక్షుడు ఖాజ సోహెల్ మొహియుద్దీన్, సయ్యద్ గఫ్పూర్ నియాజీ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

చేగుంట(తూప్రాన్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని కాంగ్రెస్ మహిళా నాయకురాలు కత్తి కార్తీక అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని రాంపూర్ గ్రామంలో పర్యటించిన కత్తి కార్తీక పలువురు బాధిత కటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్, గణేశ్, కర్నాల శ్రీనివాస్ ఉన్నారు.

మహిళలు స్వయం సహాయకంగా ఎదగడానికి కృషి



ఐస్‌క్రీం పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ నవనీత, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): మహిళలు స్వయం సహాయకంగా ఎదగడంలో ముందుకెళ్తుండడం సంతోషకరమని ఎంపీపీ పురం నవనీత బుధవారం అన్నారు. మండలంలోని కాళ్లకల్‌లో డీఆర్డీఏ శాఖ సహకారంతో డ్వాక్రా గ్రూప్‌లో ప్రాసెసింగ్ యూనిట్‌లో భాగంగా గ్రామానికి చెందిన కొత్తూరి లహరి ఐస్‌క్రీం పార్లర్‌ను రూ. 2 లక్షలతో ఏర్పాటు చేసుకుంది. ఈ షాపును ముఖ్య అతిథి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వచ్చాక మహిళలు స్వయం సహాయకంగా ఎదుగుతున్నారన్నారు. మహిళలకు సబ్సిడీపై లోన్లను అందజేయడంలో ఏపీఎం పెంటాగౌడ్ కృషి చేస్తున్నారన్నారు. ఏపీఎం పెంటాగౌడ్ మాట్లాడుతూ.. ఇంతకు ముందు లోన్ తీసుకున్న వాళ్లు సక్రమంగా లోన్ క్లియర్ చేస్తే వారికి తిరిగి లోన్ ఇవ్వడం, కొత్తగా లోన్ కావాల్సిన వారికి లక్ష నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీపై లోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లావణ్య, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ భాగ్య, అసిస్టెంట్ మేనేజర్ నర్సింహారెడ్డి, సీసీ కృష్ణవేణి, మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



మిర్జాపల్లిలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేయడం నిలిపివేశారు. ఇప్పటికే కాంటావేసిన ధాన్యం రైస్‌మిల్‌కు తరలించకపోవడంతో బస్తాలు పేరుకుపోవడంతో కాంటా వేయడంలేదని నిర్వాహకులు తెలిపారు. ధాన్యం తరలించేందుకు అవసరమైన లారీలు రాకపోవడంతో సమస్య నెలకొందన్నారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్జాపల్లి ధాన్యం కొనుగోలు కంద్రంలో ఇప్పటి వరకు 125 మంది రైతులు ధాన్యం తీసుకురాగా కేవలం 25 మంది రైతులకు చెందిన ధాన్యం మాత్రమే కాంటా అయిందని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి, ధాన్యం కాంటావేసి ధాన్యం తరలించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

ఒకటో తేదీలోగా రేషన్ బియ్యం అందించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

కౌల్చారం(నర్సాపూర్): రేషన్ దుకాణాలకు ఒకటో తేదీలోగా బియ్యం అందించి, పేదవాడి ఆకలి తీర్చాలని టీఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి పుర్ర ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన రేషన్ బియ్యం పంపిణీ సకాలంలో అందక జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతీనెల 1 నుంచి 10గా రేషన్ బియ్యాన్ని దుకాణాలకు సరఫరా కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ సరఫరా కాకపోవడం రేషన్ బియ్యం పై ఆధారపడ్డ పేదవారు ఇబ్బందులు పడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్వామివారికి పుట్ట తేనెతో అభిషేకం మహాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే గణపతి, గౌరీ పూజలు, కంకణ ధారణ, పుణ్యాహావాచనం, నవగ్రహ మంటపం, యోగిని, వాస్తు, దేవత పూజలు, గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, శివ, నవగ్రహ శ్రీధర్మశాస్త్ర అష్టోత్తర శతనామ పూజలు, పూర్ణాహుతి దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఈశ్వరపురం వేద పండితులు బ్రహ్మశ్రీ కాసుల ఆదిత్య వర్ధన్ శర్మ, వైద్య రాజు పంతులు, వైద్య శ్రీను పంతులు, అంకుష్ శర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త సేవా సమాజం బాధ్యులు గంగా లక్ష్మీపతి, కొండా శ్రీనివాస్, శివరామకృష్ణ మేడిశెట్టి శంకర్, వెంకటనారాయణ, శ్రీనివాస్, పార్థివనాథ్, చిన్నరాజు, శ్రవణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ, జనుము సాగు చేయండి



విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): జీలుగ, జనుము సాగు చేసి భూసారాన్ని కాపాడాలని ఏఓ రాజేశ్ రైతులకు సూచించారు. బుధవారం రైతులకు జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పచ్చిరొట్టె ఎరువులైన జీలుగ, జనుము వంటివి వాడడం వల్ల, ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని ఏఓ రాజేశ్ బుధవారం తెలిపారు. అల్లాదుర్గ్ మండలంలో 65 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము సబ్సిడీపై పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 30 కేజీల జీలుగా బస్తా రూ.842.70, 40 కేజీల జనుము బస్తా రూ.1224.80 ధర ఉందన్నారు. రైతులు జీలుగ లేదా జనుము వేయడం వలన ఎకరానికి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని చెప్పారు. ఎకరానికి జీలుగ 12 నుంచి 15 కిలోలు, జనుము ఎకరానికి 20 కిలోల విత్తనం అవసరమవుతుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు అధికారులు, నవీన్, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



పూజలు చేస్తున్న త్రిష దామోదర్

రేగోడ్(మెదక్): మండలంలోని గజ్వాడలో నిర్వహిస్తున్న దుర్గమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అనంతరం త్రిష దామోదర్ కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్, సీనియర్ నాయకుడు కిషన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు మొహిజొద్దీన్, రేగోడ్ ఎంపీటీసీ నర్సింలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేత



మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కప్ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికైన వాలీబాల్, కబడ్డీ, ఇతర క్రీడాకారులకు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో క్రీడల్లో పాల్గొనడానికి వెళ్తున్న క్రీడాకారులకు సొంత ఖర్చులతో మంగళవారం రాత్రి మండల కేంద్రంలో అందజేసినట్లు తెలిపారు. క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు తేవాలన్నారు.

◆ ఆర్థికసాయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని సోమక్క పేట్ గ్రామంలో బుధవారం బుడ్డోల దుర్గయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో కౌశిక్ కమ్యూనికేషన్ నిర్వాహకుడు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రామగొని శ్రీకాంత్‌గౌడ్ మృతుడి అంత్యక్రియల ఖర్చులకు రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశాడు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేశం, హన్మంతు, భూమయ్య, పోచయ్య, విఠల్ పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): పలు గ్రామాలకు చెందిన పేదింటి కుటుంబాలకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బండారి గంగాధర్ బుధవారం ఆర్థిక సాయం చేశారు. శివ్వంపేట, వెల్దుర్తి, నర్సాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేదింటి కుటుంబాలకు ఆర్థికసాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేసినట్లు గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


◆ 26న ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ సమావేశం

వెల్దుర్తి(తూప్రాన్): ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 26న తూప్రాన్ ఆర్‌అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా సీనియర్ నాయకుడు యాదగిరి మాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్‌మాదిగ హాజరవుతారని తెలిపారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ చేగుంట పట్టణ బీఆర్‌ఎస్ కమిటీల ఎన్నిక

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట బీఆర్‌ఎస్ కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ యూత్ అధ్యక్షుడిగా మంచికట్ల వంశీ, బూత్ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షుడిగా రహీం, ఎస్సీ కమిటీ అధ్యక్షుడిగా గోపాల్, మహిళా కమిటీ అధ్యక్షుడిగా నాగరాణి, రైతు కమిటీ అధ్యక్షుడిగా దశరథం, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కుర్ర లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.

◆ పుస్తె, మెట్టెలు అందజేత



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో నిరుపేద యువతి వివాహానికి మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు బుధవారం పుస్తె, మెట్టెలు అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ల కృష్ణాగౌడ్ బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రం, ఇతర నాయకులు వాటిని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



చిలప్‌చెడ్(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏఓ బాల్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్లలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని, రైతులు పండించిన చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సోమక్కపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా నిర్వాహకులకు సూచనలు ఇచ్చామన్నారు. త్వరలోనే మండలంలో పూర్తిగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పోచయ్య, నర్సింలు, రైతులు సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్నగొట్టిముక్ల, చెన్నాపూర్, గోమారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తరలింపు కోసం లారీలు రాకపోడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎంపీడీఓతో మొరపెట్టుకున్నారు. తూకం వేసిన ధాన్యం రైస్ మిల్స్‌కు తరలించేందుకు అవసరం ఉన్న లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మండలంలోని మరిన్ని రైస్‌మిల్స్‌లో ధాన్యం పంపించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు

కౌల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు తూకం, రవాణా పరంగా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నాగయ్య విలేకరులతో తెలిపారు. మంగళవారం సాయంత్రం నాటికి 454 మంది రైతుల నుంచి 55,772 బస్తాల ధాన్యాన్ని తూకం వేసి రైస్ మిల్లులకు రవాణా చేశామన్నారు. బుధవారం మరో 2 వేల బస్తాల ధాన్యాన్ని తూకం వేశామని, ఇంకా మిగులు 6000 బస్తాల ధాన్యం తూకం వేసి రవాణా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యం బస్తాల రవాణా కోసం లారీలను సకాలంలో పంపించకపోవడం ట్రాన్స్‌పోర్ట్ యజమానితో కొంతవరకు తమకు ఇబ్బందులు ఉన్నాయని ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రైతుల సహకారంతో వారం రోజుల్లోగా పూర్తి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు.